## 2. జన్మహక్కు

"ఆ అయ్యగార్తో కుంచెం జేగర్తగుండండమ్మా!"

మాట వినిపించింది. గొంతు కూడా గుర్తే. అయినా నిర్మల వెనక్కి తిరిగి చూసింది. ఆఫీసు స్వీపర్ రాములమ్మే, ఆ మాటలన్నది.

'ఆ అయ్యగారు' అంటే ఆఫీసు సూపరెంటు యాకూబ్ గారే.

"నువ్వింకా ఇంటికి వెళ్లలేదూ?" అంది నిర్మల, "నీ డ్యూటీ మధ్యాహ్నం రెండు గంటల్తో సరి కదా!".

"మా బతుకుల సంగతి మీకు తెలీందేటుందమ్మా. పొద్దుట ఎవ్వల్లూ రాక ముందే ఆపీస్కొచ్చి గదులన్నీ వూడ్చాల. వొరండా లోనియ్యీ, గదుల్లో నియ్యీ కుండల్నిండగా, కూజాల్నిండగా నీలు పట్టాల. మద్దినాల అందరి బోజనాలూ అయ్యేక మరో సుట్టు ఆపీసంతా కీన్ జెయ్యాల. అప్పుడన్నాయెలిపోనిత్తారా? జెమాన్లందరికీ తలుకొకలూ తలుకోపనీ సెప్పి బేటికి పొంపించెత్తారు. కాయితాలందించడం, టీలు తేవడం, యెంగిలి కప్పులు కడగడం ఇయ్యన్నీ గూడా సీపర్ పన్లే. నాలుగ్గంటలు కొట్నాక గేటు దాట్నాను. బస్సుల్లాక నిలబడున్నాను."

గంటసేపట్నించీ నిలబడుందన్నమాట.

యాకూబ్ గారు మోటారు సైకిలు మీద రావడం, "ఎక్కండి మేడమ్, నేను కూడా ఇటే వెళ్తున్నాను; మిమ్మల్ని మీ ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను" అని ఆఫర్ చెయ్యడం, "ఎందుకు లెండి, నేను బస్సులో వెళ్తాను" అని తను నిరాకరించడం- అంతా గమనించే ఉంటుందన్నమాట.

"నామోటార్ సైకిల్ వెనక సీటు మీద కూర్చోండి - " అని ఆయన ఆఫర్ చెయ్యగానే "పోవయ్యా! నీ కంటికి నేనెలాక్కనబడుతున్నానేమిటి?" అని కసిరికొట్టలేదు. అంచేత ఆయన ఇవాళ తనని వదిలేసినా రేపెప్పుడైనా మొహమాట పెట్టేయొచ్చని కాబోలు, రాములమ్మ ఆ హెచ్చరిక చేసింది- "ఆ ఆయ్యగార్తో కుంచెం జేగర్తగుండండమ్మా"అని.

"మొన్నొకసారి ఏటవిందనుకున్నారూ! నిర్మలమ్మకి బర్తలేదని పుస్తకాల్లోనున్నాది, మరాయమ్మ రంగు శీర్లు కడద్ది, మొగాన కుంకం బొట్టు పెడతాది, మెల్లో సెతమానాలు న్నాయి. కాల్లకి మట్టెలున్నాయి, సేతులికి మట్టిగాజులున్నాయీ, ఇందల గుట్టేటీ అని చూపరింటు బాబు యంకట్రావు గోర్ని అడిగినారమ్మా. నాను టీలు పోసినట్టే పోసి సెవులారా యిన్నానమ్మా-"

ఈ నగలూ, ఈ సొగసులూ ఎందుకూ? ఇవన్నీ పునిస్త్రీ చిహ్నాలు. నువ్వు వెధవ్వి. ఇవన్నీ పెట్టుకుందికీ, వీటితో నలుగుర్లో తిరిగేందుకీ నీకు అర్హత లేదు- అని - అతని తరపు బంధువులే కాదు, తన తరపు బంధువులు కూడా ఆ మాటకొస్తే ఏ బంధుత్వం లేని వాళ్ళు కూడా అన్నారు.

ఈ ఆఫీసు సూపరింటు కూడా- ఇప్పుడంటే వెంకట్రావునీ, శరభలింగాన్నీ మరో కోన్ కిస్కా గాణ్ణే అడిగేడేమో గాని ఈ విషయమై తనతో సరదాగానో, యాదృచ్ఛికంగానో, సీరియస్‌గానో మాట్లాడే వున్నాడు. తను చెప్పిన సమాధానంవిన్నాడు కూడాను!

✣ ✣ ✣

ఆఫీస్ సూపరింటుగా యాకూబ్‌గారు పదహారు నెలల కిందట ఇక్కడ జాయినయ్యాడు గానీ, ఇతను మళ్ళీ హైద్రాబాదుకి ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోవలసిన వాడే. పద్దెనిమిది నెలల పాటు ఏదో ఒక జిల్లా ఆఫీసులో సెక్షనాఫీసరుగా పని చెయ్యకపోతే అక్కడ ఇతన్ని పర్మనెంటు చెయ్యరు. అంచేత, ఈ ఏణ్ణర్థం కాలం గడపడానికొచ్చే డిక్కడికి.

రెండు నెల్ల కిందట ఆ సోమవారం - సెలవు కాదు. కానీ, సెలవు ప్రకటించేరుట, రేడియోలోనూ పత్రికల్లోనూ వొచ్చిందట వార్త. తనకి తెలీక ఆఫీసుకెళ్ళింది నిర్మల.

ఏమిటి, పదిన్నరైపోతున్నా హెడ్గుమాస్తాగారు రాలేదని తను ఆశ్చర్యపడుతుండగానే నైట్ వాచ్‌మన్ సోములు " నానెల్తాన్నమ్మా" అని తాళాలప్పగించి వెళ్ళిపోయాడు.

ఫాన్ స్విచ్చి వేసుకుని కుర్చీలో కూర్చుని - అర్జంట్ ఫైలు ఒకటి తెరిచి చూసుకుంటూ వుండగా ఫోన్ మోగింది.

ఇట్నుంచి తనూ, బయటి నుంచి యాకూబ్ గారూ ఒక్కసారే చేరారు, హెడ్ గుమాస్తా టేబిల్ దగ్గరికి. ఫోన్ అతనే అందుకున్నాడు.

"ఆఁ నేనే సార్, సూపరింట్ని మాట్లాడుతున్నాను. ప్రయాణం బాగా జరిగిందా సార్? అవును సార్. ఈ రోజు సెలవు డిక్లేర్ చేసేరు సార్... ఆ ఫైలా సార్? దొరుకు తుందనుకుంటాను సార్. హెడ్ క్లర్క్ రాలేదు గాని సార్; నిర్మలా మేడమ్ వచ్చున్నారు సార్. మీరు వచ్చేలోగా నోట్ తయారు చేయించేస్తాను సార్... నిర్మాలా మేడమ్ వెళ్ళిపోరనుకుంటాను సార్. ఈ ఫైల్ రాద్దామనే వచ్చినట్టుంది సార్. టిఫిన్ బాక్స్ తెచ్చుకున్నట్టుంది సార్... ఓకే సార్... ఓకే సార్, మీరు ఒంటి గంట కొస్తే చాలు సార్".

ఫోన్‌లో మాట్లాడ్డం అయిపోగానే నిర్మల సీటు దగ్గిరికొచ్చాడతను - "ఓ, మీరు కూడా ఆ పనిమీదే ఉన్నట్టున్నారే... నాకు చాలా సంతోషంగా వుంది. సెలవని తెలిసి కూడా ఈ ఫైలు అర్జంటనీ, ఇది రాసెయ్యాలనీ మీరు వచ్చినందుకు."

"సెలవని తెలియలేదు సార్..."

"అయ్యో, పేపర్లన్నిట్లోనూ వేసేరు; రేడియోలో కూడా నిన్న సాయంకాలం, ఈ ఉదయం చెప్పేరు... ఓకే. సెలవు కదా అని మీరు వెళ్ళిపోవాలనుకుంటే ఫైల్ నాకిచ్చేసి వెళ్ళిపోండి... కానీ, ఎలాగా రానే వచ్చేరు కదా. ఈ ఫైల్ మీద రాయవలసిన నోట్ మీ చేత్తో మీరే రాసేయడం మంచిది కదా. కావాలంటే నేను డిక్టేట్ చేస్తాను... ... ..."

మూడున్నర పేజీలు చెప్పాడు.

ఫైలుకి సంబంధించిన వాక్యం ఒకటి చెప్పి, అది అక్షరాలుగా మారి కాగితం మీదికి ఎక్కే లోపుగా ఫైలుకి సంబంధించని వాక్యాలు రెండూ మూడూ మాట్లాడేడు...

- మీరు ఏదైనా రాసేటప్పుడు పెన్ నాలుగువేళ్ళతోనూ పట్టుకుని రాస్తారన్నమాట! అందుకే మీ దస్తూరి అంత కుద్దిరంగా వుంటుంది!

- దస్తూరీ అనేది మనిషి యొక్క మానసిక స్థితికి ఒక సూచిక లాంటిది - అంటాడొక శాస్త్రవేత్త... గజీ బిజీగా రాసే మనిషి తొందరగా నిర్ణయాలు తీసుకుని అందువల్ల నష్టం వొస్తే దానికి తగ్గట్టుగా ప్రవర్తనే మార్చుకుంటాడట. అక్షరాలు కుదురుగ్గా పేర్చి రాసే వ్యక్తి నిదానంగా

ఆలోచించిగానీ నిర్ణయం తీసుకోడం జరగదనీ అందువల్ల సాధారణంగా అటువంటివాళ్ళు నష్టపోవడమే జరగదనీ ఆ శాస్త్రవేత్త విశ్లేషణ-

-మీరెంతో నిదానస్తులని నేనెప్పుడో గమనించేను. ఇప్పుడు మీ దస్తూరీ చూసేక నా అభిప్రాయం రైటే అని తేల్తోంది.

- మీరు కుంకం బొట్టుతో, మట్టెలూ మంగళసూత్రాలతో, సంప్రదాయ గృహిణిలా కనబడితే మీరొక విడో అని నేనసలు వూహించలేకపోయాను! కాకతాళీయంగా మీ సర్వీస్ రికార్డు చూసి మీరు మంచి పరువంపు వయసులో భర్తను పోగొట్టుకున్నారని తెలిసి చాలా బాధపడ్డాను!

- మీ వయస్సిపుడు ఇరవై ఎనిమిదని మీ రికార్డ్సులో వుంది. పైగా మీ కులంలో భర్తలు పోయిన స్త్రీలూ విడాకులు పొందిన స్త్రీలూ, మళ్ళీ వివాహాలు చేసుకోడానికి ఆంక్షలేవీ లేవని విన్నాను...

- నిజానికి కుంకం బొట్టూ, మట్టెలూ, మంగళసూత్రాలూ ఇలాంటివి అలంకారాలుగా కనబడ్డప్పటికీ, ఒక విధంగా ఇవన్నీ రక్షణ సంబంధమైన చిహ్నాలని కూడా చెప్పొచ్చు. అంటే నా ఉద్దేశం మరేం లేదు. ... అవన్నీ లేకుండా బోసిగా ఉన్న స్త్రీలని చూస్తే కొంత మందిలో కలిగే స్పందన అనండి, లేకపోతే దురాలోచన అనండి, ఈ అలంకారాలతో ఉన్న వాళ్ళని చూస్తే కలక్కపోవచ్చు.

- ఇతరుల దృష్టి వంకరగా పడదు - అని నిర్ధారణ అయినప్పుడు ఈ సింబల్స్ అవసరం పెద్దగా ఉండకపోవచ్చేమో, ఇలాంటి చిన్న చిన్న పట్నాల్లో సంగతి ఎలా వున్నా పెద్ద పెద్ద సిటీస్‌లో అయితే ఈ రోజుల్లో ఎవరో గాని - ఇవన్నీ గాని, ఇందులో కొన్ని గాని ఉంచుకోవడం లేదసలు.

డిక్టేషన్ పూర్తయ్యేసరికి పన్నెండు గంటలు దాటింది టైమ్.

తను రాసింది సరిగా ఉందాలేదా చూడమన్నట్టు ఫైలు అతని ముందుకి జరిపింది నిర్మల. అతను ఒక్కొక్క పేరా చూస్తూ, అలా రాయడానికి ఫైల్లో అంతకి ముందున్న ఆధారాలు ఆ పేజీల్లో ఉన్నాయా లేదా అని సరి చూసుకుంటూ వుండగా నిర్మల తన టేబిల్ సొరుగుకి తాళం పెట్టుకుంది. పక్కనున్న కబోర్డుకి తాళం పెట్టింది. రుమాలు, తాళం చెవులు, టిఫిన్ బాక్సు బ్యాగ్‌లో పెట్టుకుంది. బ్యాగ్ జేబ్బకి తగిలించుకుని లేచి నిలబడి, "నే వెళ్తున్నాన్, సార్!" అని బయలుదేరి, తన టేబిల్ దాటి ఇవతలికొచ్చింది నిర్మల.

"ఓకే...ఓకే... థాంక్యూ. మీరు ఎటెండెన్స్‌లో సంతకం చేసి వెళ్ళండి. మీకు ఒక కాంపెన్సేటరీ ఆఫ్ వస్తుంది" అన్నాడతను, ఫైల్‌ని నిశితంగా పరిశీలించుకుంటూనే.

"సార్; మీరు నా మీదా, నా పరిస్థితుల మీదా జాలిపడి ఎంతో మంచి మాటలన్నారు. థాంక్స్. కానీ, మీ మాటల్లో కొన్ని, కామెంట్స్‌లా, కొశ్చన్స్‌లా కూడా - అనిపించేయి నాకు. ఎదురు తిరిగి సమాధానాలు చెప్తున్నానని అనుకోకపోతే మనవి చేస్తాను.

"అతను పోగానే వేషం మార్చమనీ, ఆభరణాలు తీసేమనీ మా బంధువులందరూ అన్నారు. కానీ, నేను వాళ్ళ మాటలు పాటించలేదు. ఈ వేషం, అలంకారం ఇవన్నీ నా శరీరంలో భాగాలుగా స్థిరపడ్డాయి. నేనెలాంటి బట్టలు కట్టుకోవాలి, నా వొంటి మీద ఆభరణాలు ఉంచుకోవాలా వొద్దా- ఇవన్నీ నా వ్యక్తిగతమైన ప్రశ్నలూ, హక్కులూ అని నా ఉద్దేశం.

"ఇవన్నీ కూడా, నేను ఇంపుగా కనబడ్డానికి వేసుకున్నవి అని అనుకోవచ్చు. నా ఆర్థిక స్థితిని

తెలియజెయ్యడానికి ధరించినవి అనుకోవచ్చు. మీరన్నట్టు రక్షణ చిహ్నాలుగా కాక రిస్కుగా కూడా అనుకోవచ్చు. ఎవరు ఏమనుకున్నా సరే నేను మాత్రం వీటిని తీసేది లేదండి. వీటి మూలంగా మా అన్నయ్య ఒక్కడు తప్ప - మా వదినగారితో సహా అందరూ నాతో సరిగా మాట్లాడ్డం మానేశారు. అయినా సరే, నా నమ్మకం నాదేనండి."

ఆ నాలుగు ముక్కలూ చెప్పేసి చక చకా వెళ్ళిపోయింది నిర్మల. ఆఫీసు సూపరెంటు లేచాడనీ, తన వెనకాల కొంత దూరం రావడానికి సిద్ధపడుతూ కుర్చీ జరుపుకున్నాడనీ, మళ్ళీ ఆగిపోయాడనీ తెలిసింది. 'సారీ నిర్మలా మేడమ్. మిమ్మల్ని బాధ పెట్టాలనే ఉద్దేశం లేదు నాకు' అని యాకూబ్ చెప్పినట్టు స్పష్టంగా వినబడింది. కాని నిర్మల వెనక్కి తిరిగి చూడలేదు.

ఆ తరవాత నాలుగు రోజులకి సీనియర్ గుమస్తా రామనాథం ఆఫీసుకి వస్తూనే సూపరింటుగారితో, "ఇదుగో సార్; మీరువింటానన్న కేసెట్:" అని ఒక ఆడియో కేసెట్ అందిస్తూ, సంచీలోంచి ఒక టేపు రికార్డరు తీసి ఆయన టేబిలు మీద పెట్టాడు. "ఇది మా అమ్మాయిది. రేపు తెచ్చేస్తానని చెప్పి పట్టుకొచ్చేను" అన్నాడు.

"రేపటి దాకా ఎందుకు? సాయంకాలం వెళ్ళేటప్పుడు తీస్కెళ్ళిపోవచ్చు" అన్నాడు యాకూబ్. ఐదునిముషాల తరువాత తను అక్కడికి వెళ్ళినపుడు అందులోంచి వినిపించిన పాట:

"పసుపు కుంకుమ; నీకు, బాలా

జన్మహక్కు కాదా? బాలా, జన్మహక్కు కాదా?"

నిర్మల యాకూబ్‌గారి టేబిల్ మీద తను తెచ్చిన ఫైల్ తెరిచి పట్టుకోగానే అతను టేపు రికార్డరు ఆఫ్ చేసేడు. ఫైలు సంతకం అయిపోగానే నిర్మల తన సీటుకి వెళ్ళాలని అటు తిరిగింది. "ఉండండి." అన్నాడు యాకూబ్.

" మా ముస్లిమ్స్‌లో లేడీస్ భర్త ఉన్నా లేకపోయినా బొట్టు పెట్టుకోరు. హిందూ స్త్రీలు భర్త పోయినా సరే బొట్టు వదలనవసరం లేదని ఒక ప్రబోధం ఉందంటేను; అది ఎట్లా ఉంటుందోనని తెప్పించి విన్నాను. ఎప్పుడో **1940**లో వచ్చిన సినిమాలో పాట అని రామనాథం గారు చెప్పేరు. అంటే ఈ ఐడియా కొత్త తరానిది కాదన్నమాటే కదా!"

"మా ఆచారాల మీదా, అలవాట్ల మీదా, మీరు చాలా ఇంట్రస్టు చూపిస్తున్నారే. ఎందుకో అడగొచ్చాండి?" అంది నిర్మల, చిరునవ్వుతో.

"అదే! ఒక హిందూ స్త్రీ, ఒక ముస్లిమ్ పురుషుడూ వివాహం చేసుకున్నారనుకోండి. ఆ అమ్మాయి తను బొట్టు పెట్టుకోకతప్పదని గొడవ చేస్తుందంటారా?"

"ముస్లిమ్ స్త్రీలు మాకంటే ఆర్భాటంగా చెమ్కీ బట్టలు వేసుకుంటారు. నగలు కూడా ఎన్నో రకాలు పెట్టుకుంటారు. బొట్టు మాత్రం ఎందుకు పెట్టుకోకూడదు?" అని నవ్వుతూనే వెళ్ళింది నిర్మల.

✣ ✣ ✣

రాములమ్మ హెచ్చరిక బస్సులోనూ, బస్సు దిగి ఇంటికి వస్తున్నప్పుడూ చెవుల్లో రింగుమంటూనే వుంది నిర్మలకి. ఆ హెచ్చరికలో అభిమానం నుంచి అపహాస్యం దాకా ఎన్నో ఉండొచ్చు. కాని, ఆ రోజు అతను తన మాటలు విన్నాక మళ్ళీ ముఖా ముఖీ తటస్థ పడ్లేదు. " మీ ఆఫీసులో నీకు పై అధికారిగా వున్న యాకూబ్‌గారి నేస్తం ఒకరు ఈ మధ్య నా దగ్గరికి వచ్చేరు. నీ పనేదో నువ్వు చేసుకోపోవడం, అనవసరపు జోక్యాలు పెట్టుకోకుండా సంతోషంగా వుండడం;

ఇట్లాంటివన్నీ మంచి లక్షణాలు అని అందరూ అనుకుంటారట - అని చెప్పాడు" అని తన అన్న వ్రాసిన ఉత్తరం కూడా నిర్మలకి గుర్తొచ్చింది.

"ఇతనికి నన్ను పెళ్ళి చేసుకోవాలని ఉన్నట్టుంది" అని ఎన్నోసార్లు అనిపించిది.

✣ ✣ ✣

"ఇదేంటన్నయ్యా. ఎప్పుడొచ్చేవు?" - గుమ్మం ఎక్కుతూ వుండగా అక్కడ కూర్చుని కనిపించిన నాగరాజును పలకరించింది.

"మరే" - అన్నాడంతే, అతను.

నిర్మల తాళం తెరిచింది. లోపల అడుగుపెట్టి; లైటు, ఫాను వేసి; తన బ్యాగ్ దాచుకుని, అతని సంచి అందుకుని జాగర్త పెట్టి; అతన్ని కూర్చోబెట్టి మంచి నీళ్ళు తెచ్చి ఇచ్చింది. అతను ఓ చేత్తో మంచినీళ్ళు గ్లాసు అందుకుంటూ, రెండో చేత్తో తన జేబులో ఉన్న ఒక ఉత్తరం తీసి ఆమెకి అందించేడు. "సదూకో" అన్నాడు.

"చదూకో ... చ ... చ ... చ ... అనాలి"

"సర్లేవో"

"శ్రీ నాగరాజుకి నమస్కారములు. నేను లోగడ వ్రాసిన ఉత్తరము మీకు అందజేసిన నా మిత్రుడు జగ్గారావు తాను మీతో ఎక్కువ సేపు మాట్లాడలేదని చెప్పినాడు. ఈ నెల 30వ తేదీకి నా ట్రెయినింగు పూర్తవుతుంది కనుక నాకు హైద్రాబాదు బదిలీ అవుతుంది. నేను అన్ని విషయాలు మా తల్లిగారితో మాట్లాడినాను. ఆవిడ ఈ నెల 16వ తేదీన ఇక్కడికి వస్తున్నారు. ఆ రోజుకి దయచేసి మీరు కూడా రావలయును.

" నా వ్యక్తిగత వివరములు మీకు ఇదివరకే జగ్గారావు చెప్పినాడట. అయిననూ మరల తెలియపరచుచున్నాను. మాది అసలు కృష్ణాజిల్లా తేలప్రోలు అనే వూరు. నాది పర్మనెంటు ఉద్యోగము. నేను హైద్రాబాదులో ఒక చిన్న ఇల్లు సంపాదించుకున్నాను. నాకు ఇద్దరు అన్నలు. వారిద్దరూ అమెరికాలో ఉన్నారు. మాకు అక్క చెల్లెండ్రు లేరు. మా అమ్మగారు అమెరికా వెళ్లరు. నా వద్దనే ఉంటారు.

" నాకు పదేండ్ల క్రితము అనగా నా ఇరవై మూడవ ఏట వివాహము అయినది. అయితే నా భార్య రెండేళ్ళ క్రిందట ప్రసూతి సమయంలో మరణించినది. బిడ్డ కూడా దక్కలేదు. కడచిన ఏడాది కాలంగా మా అమ్మగారు నన్ను మరలా వివాహం చేసుకోమని ఒత్తిడి చేయుచున్నారు.

" మీ సోదరి నిర్మలమ్మను కడచిన ఏడాది ఆరు మాసముల నుండి నేను ఎరిగి వున్నాను. రూపం, వయసు, ప్రవర్తనల రీత్యా ఆమె యందు నాకు ఇష్టము ఏర్పడినది. ఆమె మంచి చెడ్డలు చూసే పెద్దగా మీరున్నూ; సంబంధిత వ్యక్తిగా ఆమెయున్నూ ఇష్టపడితే నేనామెను వివాహము చేసుకోగలను. నాకు కులం, మతం, ద్వితీయ వివాహం వంటి పట్టింపులు లేవు. వివాహం జరిగితే ఆమె ఉద్యోగము చేయనవసరము లేదు. మా తల్లిగారికి తోడుగా ఇంట వుండవచ్చును.

" నిర్మలమ్మ నాతో మాట్లాడినప్పుడు - ఆభరణాలు, బొట్టు మొదలైన వాటిని విసర్జించనని అన్నారు. పాతకాలానికి చెందిన వ్యక్తి కనుక మా అమ్మగారి దృష్టిలో ఇది ఒక అడ్డు కావచ్చు అని నా అనుమానము. రాబోయే మంచి పరిణామాన్ని దృష్టిలో వుంచి ఈ విషయంలో వెసులుబాటు కల్పించుకొంటే అన్నీ సవ్యంగా జరుగుతాయని నేను మాత్రం నమ్ముతున్నాను. మా తల్లి గారు

నా వద్దనే ఉంటామని నిశ్చయించారు. కనుక ఆమె అభిప్రాయాలకు గౌరవం ఇచ్చే బాధ్యత నాపైన ఉన్నది.

"వివాహం విషయంలో నిర్మలమ్మయున్నూ, నేనున్నూ స్వతంత్రులమే అయినప్పటికీ, మీరున్నూ, మా తల్లిగారున్నూ పెద్దలుగా నిలిచి వుండుట శ్రేయస్కరమని భావించి, 16వ తేదీకి రావలసిందిగా కోరడమైనది."

ఉత్తరం నాగరాజుకే ఇచ్చేసింది నిర్మల. "ఇప్పుడో యిగనో ఆళ్ళొచ్చేత్తారు" అంటూ జేబులో పెట్టుకున్నాడు.

"నాతోనెప్పుడూ అన్లే" అంది నిర్మల.

"ఒకే సోట పన్జెయ్యటాన సనువెంతుంటాదో, మోమాటం గూడా అంతుంటాది గావాల. ఇంతకీ ఏటందాం?"

"మంచోడే" అంది నిర్మల.

"అదీ, మాట. మనం గూడ మంచనిపించుకుంటే పోలా?"

నిర్మల లోపలి గదిలోకి వెళ్ళిపోయింది. మొహం, కాళ్ళూ చేతులూ కడుక్కొని బట్టలు మార్చుకొని తలా, మొహం దిద్దుకుంది. ఇవతలికొచ్చి; గోడ బీరువాలో రెండు ఫోటోలు తీసి నాగరాజుకిచ్చింది. రెండూ విడి విడిగా పక్కన పక్కన పెట్టి: "నే నెలాగుంటే బాగుంటాది, ఇలాగా, ఇలాగా?" అని, గదిలో ఒక మూలనున్న ఫ్లాస్కు తీసుకుంది. "ఆళ్ళొస్తే కూర్చోబెట్టు. కొంచెం టీ పోయించుకొస్తా. పాల్లేవ్." అని చెప్పులు తొడుక్కొని వెళ్ళిపోయింది.

నాగరాజు రెండు ఫోటోలనీ పరిశీలించి చూసేడు. బొట్టు లేకుండా, తెల్ల చీరతో, గాజులూ ఆభరణాలూ లేకుండా, మొహంలో 'ఏడుపు' లేకపోయినా 'ఏడిసినట్టేవుంది', నిర్మల; ఆ మొదటి బొమ్మలో.

✣ ✣ ✣

నిర్మల తిరిగి వచ్చేసరికి వాకిట మోటార్ సైకిలు వుంది. నాగరాజు ఆమె చేతిలో ఫ్లాస్కు అందుకొని "ఒచ్చారు" అన్నాడు.

లోపల యాకూబ్ కుర్చీలోనూ, వారి తల్లి గారు మంచం మీదనూ కూర్చుని వున్నారు.

ఆవిడ రెండు చేతుల్లోనూ, చెరోటీ చొప్పున; ఇందాక నిర్మల నాగరాజు కిచ్చిన ఫొటోలు వున్నాయి.

నిర్మల ద్వారం దగ్గిర వొక్క నిమిషం ఆగింది.

"మన్లో కూడా చాలా మంది మంగళసూత్రాలు తప్ప మిగిలిన అన్ని రకాల నగలూ పెట్టుకుంటున్నారు అమ్మాజాన్. ఎటొచ్చీ; నియమంగా కాక, స్తోమత చిహ్నాలుగా పెట్టుకుంటున్నారు. ఇంక - బొట్టు అనేది ఒక మతానికి సంబంధించిన చిహ్నంగా కాక, ఆర్టిస్టిక్ బేలన్స్ కోసమని మొహం మీద అమర్చుకునే చిహ్నంగా చూసుకుంటే దాని అందం బోధపడుతుందేమో?" అన్నాడు యాకూబ్ తన తల్లి గారితో.

కొడుకు మాట్లాడ్డం అవగానే ఆవిడ లేచింది. ద్వారం వరకూ వచ్చి నిర్మల రెండు చేతుల్నీ తన చేతుల్లోకి తీసుకుంది. "జీతే రహో, బేటీ!" అంది విశాలంగా నవ్వుతూ.

మేడం నిర్మల "బేగం నిమ్మీ" అయిన ఆశీర్వచనం అది. ☼

***("రచన" మాసపత్రిక : మే 1994)***